ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.31, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 38, పందిరి బీర 40, క్యాబేజీ 21, క్యారెట్ 40, దొండ 18, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 28, రూట్ రూట్ 23, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 33, చామగడ్డ 40, మొరంగడ్డ 35, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకుచ అమలులో ఉంటాయి.

అసదుద్దీన్‌కు శుభాకాంక్షలు



రాంగోపాల్‌పేట్: హైదరాబాద్ పార్లమెంటు నుంచి విజయం సాధించిన అసదుద్దీన్ ఓవైసీని ఆ పార్టీకి చెందిన రాంగోపాల్‌పేట్ డివిజన్ నాయకులు అశోక్ కలిసి అభినందనలు తెలిపారు. శనివారం దారుసలాంలో ఓవైసీని కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతున్న అసదుద్దీన్ ఓవైసీని ప్రజలు గెలిపించడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

క్రైస్తవుల ట్రంఫెట్ ఫెస్టివల్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న స్వరణ్‌జిత్‌సేన్

రాంగోపాల్‌పేట్: ట్రంఫెట్ ఫెస్టివల్ ఫెలోషిప్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్ వెస్లీ చర్చి నుంచి ట్రంఫెట్ ఫెస్టివల్ ర్యాలీని నిర్వహించారు. ఉదయం మాజీ డీజీపీ స్వరణ్‌జిత్ సేన్ జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. వందలాది మంది క్రైస్తవులు ప్లకార్డులు పట్టుకుని యేసు పాటలు పాడుతూ క్రీస్తు రెండవ రాకపై అవగాహన కల్పించారు. అంతకు ముందు చర్చి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో స్వరణ్‌జిత్ సేన్, ఫ్రీ మెథడిస్ట్ చర్చ్ ఆఫ్ ఇండియా బిషప్ జాన్ గొల్లపల్లి యేసు క్రీస్తు రెండవ రాక గురించి వివరించారు. లోకంలోని పాపులను రక్షించేందుకు లోకానికి వచ్చి ప్రాణాలు పెట్టి తిరిగి లేచిన యేసు క్రీస్తు మరోమారు ఈ లోకానికి రాబోతున్నాడని బైబిల్‌లో దీని గురించి స్పష్టంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ సెల్విన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, చార్లెస్ సంపత్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా వెలుగులో తెలంగాణ విద్యార్థి ఉద్యమం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మందాల భాస్కర్ అధ్యక్షత వహించగా పుస్తక రచయిత నలమాస కృష్ణ, ప్రొ.కాశీం, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, ప్రొ.ననుమాసస్వామి, ప్రొ.గాలి వినోద్‌కుమార్, ఓయూ పూర్వవిద్యార్థి నాయకులు తదితరులు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు

రోడ్లపై వాహనాలు నిలపకుండా దృష్టి సారిస్తాం

- ఉల్లంఘనులపై కేసులు నమోదు చేస్తాం
- 'సాక్షి'తో ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీ ఎన్. వెంకటేశ్వర్లు



సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. ఎక్కడ కూడా ట్రాఫిక్‌తో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు గట్టి చర్యలు తీసుకుంటున్నామని నార్త్‌జోన్ ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్(ఏసీపీ) ఎన్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బేగంపేట్ ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో పని చేసిన వెంకటేశ్వర్లు బదిలీపై వచ్చి ఇటీవల సికింద్రాబాద్ ట్రాఫిక్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకుంటున్న చర్యలపై 'సాక్షి'తో వివరించారు. – బన్సీలాల్‌పేట్

ప్రశ్న: సికింద్రాబాద్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఏసీపీ: ఉత్తర మండలంలోని సికింద్రాబాద్ ఏరియా పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి గట్టి చర్యలతో ముందుకు సాగుతున్నాం. పెరుగుతున్న వాహనాల రద్దీకి తోడు..ఉన్న రోడ్లపైనే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి శ్రమిస్తున్నాం. సమస్య ఉత్పన్నమైన ప్రాంతాల్లో రోడ్లపై వాహనాలు నిలువకుండా తమ సిబ్బందిని రంగంలోకి దించి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నాం. రాత్రి సమయాల్లోనూ తమ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు.

ప్రశ్న: సికింద్రాబాద్ పరిసరాల్లో ట్రాఫిక్ కేసులు..నమోదు గురించి వివరించండి

ఏసీపీ: సికింద్రాబాద్‌పరిసరాల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. అక్రమ పార్కింగ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ ఇతరత్రా పత్రాలు లేకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు వేస్తున్నాం. ఉత్తర మండలం పరిధిలో ప్రతి నెలా సుమారు 10 వేల వరకు కేసులు నమోదవుతున్నాయి. గతేడాది లక్షాడెబ్బై వేల కేసులు నమోదు అయ్యాయి.

ప్రశ్న: నార్త్‌జోన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ ఉండే రోడ్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఏసీపీ: తమ పరిధిలో అనేక చౌరస్తాలతో పాటు..జంక్షన్లు రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా బేగంపేట్, ప్యారడైజ్, సీటీఓ చౌరస్తా, సంగీత్ చౌరస్తా, ప్యాట్నీ చౌరస్తా– బైబిల్ హౌస్, ఆర్పీ రోడ్డు, ఆలుగడ్డబావి, తిరుమలగిరి చౌరస్తా, కార్ఖానా, బోయిన్‌పల్లి అంబేడ్కర్ చౌరస్తా, ఎంజీ రోడ్డు, మెట్టుగూడ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఎక్కువగా ఉంది. అయితే సదరు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా ఎప్పటికప్పుడు తమ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నాం. మోండా మార్కెట్ ఏరియాలో ట్రాఫిక్ లేకుండా చర్యలు చర్యలు చేపట్టాం. అక్కడి ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడబండ్ల నిర్వాహకులు, వ్యాపారస్తులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చాం. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: రోజుల తరబడి రోడ్లపై పార్కింగ్, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ఏసీపీ: రోడ్లపై ఎక్కడ పడితే రోజుల తరబడి పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. సదరు పార్కు చేసిన వాహనానికి రూ. 1,600 వరకు చలాన్ విధించి ఆ వాహనాలను సీజ్ చేస్తున్నాం. అదే విధంగా ఫుట్‌పాత్‌ల అక్రమణలను తొలగిస్తున్నాం. పాదచారులు రాకపోకలు సాగించడానికి ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు వ్యాపార కార్యకలాపాలకు కేంద్రాలుగా మారాయి. దీంతో పాదచారులు రోడ్డుపై నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ముందుగా సదరు వ్యాపారులకు అవగాహన కల్పించి వినకుంటే సదరు ఫుట్‌పాత్ ఆక్రమణదారులపై కేసులు నమోదు చేస్తున్నాం. ఎక్కడైనా అక్రమ పార్కింగ్‌లతో పాటు రోజుల తరబడి నుంచి వాహనాలు పార్కింగ్ చేసిన వాహనాలపై ప్రజలు ఫొటోలు తీసి వాట్సాప్ ద్వారా తమకు పంపితే సదరు వాహనాలపై చలాన్లు వేస్తాం.

ప్రశ్న: డ్రంకెన్ డ్రైవ్ తీరుతెన్నుల గురించి వివరించండి..

ఏసీపీ: ఉత్తర మండలం పరిధిలోని గోపాలపురం, మహంకాళి, మారేడ్‌పల్లి, తిరుమలగిరి, బోయిన్‌పల్లి, బేగంపేట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల పరిధిలో శుక్ర, శనివారాలు డ్రంకెన్ డ్రైవ్‌లను నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. తాగి వాహనాలను నడపడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న మైనంపల్లి, శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: కాంగ్రెస్ పార్టీపై ఎంతో నమ్మకంతో కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో విజయాన్ని అందించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంటు ఇన్‌చార్జ్ మైనంపల్లి హన్మంతరావు, విజయం సాధించిన శ్రీగణేష్ అన్నారు. శనివారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు అల్లాడి గౌరిశంకర్, బాబురావు ముదిరాజ్, నందికంటి రవి ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో వారు పాల్గొని రెజిమెంటల్ బజార్‌లోని గండిమైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వివిధ ప్రాంతాల్లో ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో కంటోన్మెంట్ రూపురేఖలు మార్చి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామన్నారు. ర్యాలీలో ఖదీర్ వన్, బల్వంత్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణాయాదవ్, బద్రినాథ్‌యాదవ్, సంతోష్‌యాదవ్; శ్రీనివాస్, యేసురత్నం, ఆనంద్, నాగేష్‌యాదవ్, బాబూరావు పాల్గొన్నారు.

కార్డినల్‌ను కలిసిన శ్రీ గణేష్..

రాంగోపాల్‌పేట్: ఇటీవల జరిగిన కంటోన్మెంట్ అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీగణేష్ శనివారం హైదరాబాద్ ఆర్చ్ బిషప్, కార్డినల్ పూల ఆంథోనిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రేమండ్ హెడ్‌వర్డు శ్యాంసంగ్ సూర్యకాంత్, ఆంథోనీ, జోసఫ్, మైఖెల్ అబ్రహం, జాన్ రాడ్రిక్స్, ప్రభు రంజిత్, మరేష్ కుమార్, జోసెఫ్ పాల్గొన్నారు.

- ఎమ్మెల్యేగా గెలిచిన మొదటిసారిగా కంటోన్మెంట్ కార్ఖానాలోని లాలాషా ఖీబ్‌లా దర్గాను శ్రీగణేష్ దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట పీసీసీ సెక్రటరీ అయాబ్‌ఖాన్, సిటీ సెక్రటరీ జమీల్, బీసీ సెల్ సెక్రటరీ రాజేష్‌యాదవ్ ఉన్నారు.



'క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దోహదం'



ప్రపంచ శాంతి ప్రార్థనల్లో పాల్గొన్న రెవరెండ్ ప్రభుకిరణ్

రాంగోపాల్‌పేట్: యేసు క్రీస్తు బోధనలు పాటించడం ద్వారా ప్రపంచంలో శాంతి నెలకొంటుందని జీపీఎఫ్ ఫౌండర్ రెవరెండ్ డాక్టర్ ప్రభు కిరణ్ అన్నారు. శనివారం సికింద్రాబాద్ క్లాక్ టవర్ ప్రాంతంలోని సెంటినరీ బ్యాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన ప్రపంచ శాంతి ప్రార్థన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యేసు క్రీస్తు తన బోధనల ద్వారా శత్రువును కూడా ప్రేమించాలని, ఇతరుల మీద, ప్రేమ, దయ చూపించాలని తెలియచేశారని చెప్పారు. ప్రతి ఒక్కరు శాంతితో జీవించాలని, దేశంలోని ప్రజలందరు సుఖ శాంతులతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కులం, మతం, ప్రాంతం, జాతి బేధాలు లేకుండా దేశంలో శాంతిని ప్రసాదించాలని క్రైస్తవులందరూ ప్రార్థనలు చేయాలని సూచించారు. ప్రముఖ గాస్పల్ సింగర్స్ ఏఆర్‌వీ సురేష్, జోసఫ్ క్రీస్తు మధురమైన గీతాలను ఆలపించి భక్తిసాగరంలో ముంచెత్తారు.ఈ కార్యక్రమంలో జీపీఎఫ్ విమెన్స్ ప్రెసిడెంట్ టీ సునిత, ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, కవిరాజ్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాలి



బడిబాటలో పాల్గొన్న టీచర్లు, అంగన్‌వాడీ పిల్లలు

అడ్డగుట్ట: బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తుకారాంగేట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపల్ నిర్మల అన్నారు. శనివారం తుకారాంగేట్‌లోని మరాఠా బస్తీలో అంగన్‌వాడీ పిల్లలతో కలిసి టీచర్లు ఇంటింటికి వెళ్లి బడిబాటపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నిర్మల మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి పిల్లలకు ఉన్నత విద్యను అందించేందుకు విద్యాశాఖ ఎంతో కృషి చేస్తోందన్నారు. చాలా మంది తల్లిదండ్రులు వారి పిల్లలను పనులకు పంపించి వారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారని అలా చేయకుండా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శోభ, అడ్డగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల టీచర్ ప్రతిభ, స్థానికులు ప్రవీణ్‌కుమార్, జయప్రకాష్ పాల్గొన్నారు.

జనగామకు సర్వాయి పాపన్న పేరు హర్షణీయం



సీఎంకు పుస్తకాన్ని బహూకరిస్తున్న రామారావుగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని కాంగ్రెస్ నేత, జైగౌడ ఉద్యమ జాతీయ అధ్యక్షులు డా.వట్టికూటి రామారావుగౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వంలో సామాన్య కార్యకర్తనైన నేను సీఎం రేవంత్ రెడ్డిని నెల రోజుల్లో ఆరు సార్లు కలుసుకోవడం ఆనందంగా ఉందని రామారావుగౌడ్ పేర్కొన్నారు. సీఎంను కలిసిన వారిలో హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.రామన్‌గౌడ్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సత్యంగౌడ్ ఉన్నారు.

జెడ్‌సీకి కృతజ్ఞతలు

బంజారాహిల్స్: ధోబీఘాట్ వ్యాయామశాల స్థలాన్ని కబ్జాదారుల చెర నుంచి విడిపించినందుకు బహుజన్ సమాజ్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు దోరపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో వ్యాయామశాల నిర్మాణానికి మంజూరైన నిధులను మళ్లీ మంజూరు చేసి పనులను చేపట్టాల్సిందిగా ఆయనకు విజ్ఞప్తి చేశారు. అలాగే జెడ్‌సీతో పాటు డీఎంసీ ప్రశాంతి, ఏసీపీ సంపత్‌కుమార్‌లను కలిసి వ్యాయామశాల పనులపై చర్చించారు.

టైం స్కేల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశమైన టైంస్కేల్ ఉద్యోగులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పని చేస్తున్న టైంస్కేల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ ఆల్ యూనివర్సిటీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఉద్యోగాల పర్మనెంట్‌తో పాటు అనేక సమస్యల పై చర్చించి పరిష్కారం కోసం ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సహాయ కార్యదర్శి మహేందర్, విఠల్, నారాయణ, వెంకటయ్య, కరీం తదితరులు పాల్గొన్నారు.

'ఐఐఐఎస్ఎల్ఏ' లో అంతర్గత విభేదాలపై ఫిర్యాదు

ఖైరతాబాద్: ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) ఆధ్వర్యంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ సర్వేయర్స్ అండ్ లాస్ అసెస్సర్స్ అంతర్గత ఇబ్బందులను ఎదుర్కొంటోంది. డైరెక్టర్ల గందరగోళంతో బోర్డులో చీలికకు దారితీసింది. ఈ నేపథ్యంలో ఓ వర్గం సంస్థలో నెలకొన్న విభేదాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలివీ... లక్డీకాపూల్‌లోని కార్యాలయంలో ఇటీవల ఇరువర్గాల మధ్య ఘర్షణల కారణంగా శుక్రవారం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ సర్వేయర్స్ అండ్ లాస్ అసెస్సర్స్ కార్యాలయం మూసివేయడంతో విభేదాలు తారా స్థాయికి చేరుకున్నాయి. లలిత్‌గుప్తా నేతృత్వంలోని వర్గం కార్యాలయంలో అధికార పత్రాలను యాక్సెస్ చేయడానికి ప్రయత్నించడంతో ప్రత్యర్థి వర్గం దాన్ని అడ్డుకోవడంతో పాటు డైరెక్టర్లు అడ్మిన్ ఆఫీసర్లను ప్రలోభాలకు గురిచేసి కార్యాలయానికి తాళాలు వేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో డైరెక్టర్ లలిత్‌గుప్తా పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ దొంగల రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ గిరిధర్

లాలాపేట: ఆరుబయట, ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న వారి సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్న ముఠాలోని పలువురిని అరెస్టు చేసిన ఘటన ఓయూ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ జగన్, ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌తో కలిసి డీసీపీ గిరిధర్‌రావు వివరాలు వెల్లడించారు. సరూర్‌నగర్ ప్రాంతానికి చెందిన కన్నాల అరుణ్‌కుమార్(23) ఫ్లవర్ డెకరేషన్ వర్క్ చేస్తుంటాడు. ఇతని భార్య స్నేహ(20) గృహిణి. వీరితో పాటు మరో వ్యక్తి శాంసన్ (19) ముగ్గురు కలిసి రాత్రి వేళల్లో ఫుట్‌పాత్‌లు, ఆరుబయట నిద్రిస్తున్న వారి నుంచి సెల్‌ఫోన్లు దొంగిలించి వాటిని అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వారిని అదుపులోకి తీసుకుని 22 సెల్‌ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

రైల్వే బ్రిడ్జిపై అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



రాంగోపాల్‌పేట్: రైల్వే బ్రిడ్జిపై నుంచి పడి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి ఆలుగడ్డబావి రైల్వే అండర్ బ్రిడ్జి కింద ఓ గుర్తు తెలియని వ్యక్తి తలకు దెబ్బలు తగిలి తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి 40 నుంచి 45 ఏళ్లు ఉంటుందని, ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. ఒంటిపై బూడిద రంగు చొక్కా, ప్యాంటు ధరించి ఉన్నాడని మృతుడు ప్రమాదవశాత్తు కింద పడి పోయాడా.. లేక పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడాలి

లిబర్టీ: ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలని మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ కోరారు. భారతీయ సంస్కృతిలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు ఎంతో గొప్ప పేరు ఉందని ఆయన గుర్తు చేశారు. శనివారం లిబర్టీ ప్లాజాలోని సంస్థ కార్యాలయంలో జరిగిన సత్‌సంగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారాయని విచారం వ్యక్తం చేశారు. చిన్నచిన్న కారణాల వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థల్లో వివాదాలు నెలకొని తల్లిదండ్రులను వదిలిపెట్టి పిల్లలు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచిని పెంచి మానవతను పెంచాలని కోరారు. కుటుంబాన్ని స్మరిస్తూ స్నేహ సంబంధం ఆర్థిక సంబంధాలకు సమాజంలోని మానవాళి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. మాతృమూర్తి పిల్లలను కని పెంచి విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత శిఖరాలకు చేర్పించడంలో ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. అయితే ప్రస్తుత పిల్లలు తమ తల్లిదండ్రులను విస్మరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పుష్పాంజలి, నంది కొండలరావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వీసీల నియామకాల్లో క్రిస్టియన్‌లకు ప్రాధాన్యమివ్వాలి

లాలాపేట: తెలంగాణ రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న యూనివర్సిటీల వైస్ చాన్సలర్ల నియామకాల్లో క్రిస్టియన్ మైనార్టీలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్, చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ట్రస్ట్ అసోసియేషన్, క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వాని కోరింది. ఈ మేరకు శనివారం తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ప్రధాన కార్యదర్శి రెవరెండ్, డా. భాస్కర్, చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ట్రస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం సోలమోన్ రాజు విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి క్రైస్తవులు విద్యా విధానం, సామాజిక అభివృద్ధికి చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. అయినప్పటికి ప్రభుత్వాలు ఉన్నత విద్యా విధానంలో క్రైస్తవులను విస్మరిస్తూనే ఉన్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్‌గా అవకాశం కల్పించలేకపోయారని తెలంగాణలోని అన్ని యూనివర్సిటీలకు వీసీలను నియమించే ప్రక్రియలో క్రిస్టియన్ మైనార్టీలకు సీఎం రేవంత్‌రెడ్డి అవకాశం కల్పించి తమ అభ్యున్నతికి పాటు పడాలని విజ్ఞప్తి చేశారు.

'బీజేపీకి మద్దతు ఉపసంహరించుకోండి'



మాట్లాడుతున్న మునీర్ పటేల్ తదితరులు

హిమాయత్‌నగర్: దేశ ప్రజల ప్రయోజనాలు, సమగ్ర అభివృద్ధి, భవిష్యత్తు కోసం టీడీపీ, జేడీయూ పార్టీలు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి తక్షణమే తమ మద్దతు ఉపసంహరించుకోవాలని సీపీఐ అనుబంధ సంస్థ అఖిల భారత తంజీమ్ ఏ ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్ పటేల్, ఉపాధ్యక్షుడు ఎం.డి.అహ్మద్‌ఖాన్ డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... గడచిన పదేళ్లలో కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అరాచక విధానాలతో దేశ ప్రతిష్టను దిగజారిన విషయం చంద్రబాబు నాయుడు, నితీష్‌కుమార్‌లకు తెలియదా అని ప్రశ్నించారు. సమావేశంలో సంస్థ గ్రేటర్ హైదరాబాద్ సమితి ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఖాసీం, రాష్ట్ర నాయకులు ఎండి.మజారుద్దీన్, ఎం.డి.యూసుఫ్, ఎం.డి.చాంద్ పాషా, ఎం.డి.సమీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గోరక్షణకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న సంఘ్ ప్రతినిధులు

హిమాయత్‌నగర్: బక్రీద్ పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ నగరానికి వివిధ జిల్లాల నుంచి గోవులను తరలించడాన్ని ప్రభుత్వం అరికట్టాలని భారతీయ ప్రాణి మిత్ర సంఘ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గోవులను రక్షించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం అయ్యాయని సంఘ్ ప్రతినిధులు ఆరోపించారు. శనివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ్ అధ్యక్షుడు రాజ్ శ్రీమాల్, కార్యదర్శి మహేష్ అగర్వాల్ మాట్లాడుతూ... నగరానికి నిత్యం వేలాదిగా ఆవులు, ఎద్దులు, దూడలను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చెక్ పోస్టుల వద్ద పెద్ద ఎత్తున తనిఖీలను నిర్వహించి, వాటిని తిరిగి స్వస్థలాలకు పంపాలని, లేకపోతే ఈ నెల 10వ తేదీ నుంచి రోడ్లపైకి వచ్చి ఆవులను తరలిస్తున్న వాహనాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో గోసంరక్షణ చట్టం ఉన్నా అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలని, అక్రమంగా గోవులను తరలిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రతినిధులు రిదేష్ జాగీర్దార్ పాల్గొన్నారు.